క్లుప్తంగా

ఎకరాకు ఒక బస్తా యూరియా



మాట్లాడుతున్న ఏఓ రామకృష్ణయ్య

అట్లూరు : రైతులు సాగు చేసిన పంటలను నమోదు చేసుకున్న వారికే యూరియా సరఫరా చేయడం జరుగుతుందని మండల వ్యవసాయాధికారి (ఏఓ) రామకృష్ణయ్య పేర్కొన్నారు. శుక్రవారం ఆయన మండల కేంద్రమైన అట్లూరు వ్యవసాయ కార్యాలయంలో అగ్రికల్చర్ అసిస్టెంట్లు, హార్టికల్చర్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుంభగిరి, కమలకూరు ఆర్ఎస్‌కేలకు 40 టన్నుల యూరియా వచ్చిందని తెలిపారు.

వ్యాసరచన పోటీలు



బహుమతి అందచేస్తున్న నాగార్జునరెడ్డి

పోరుమామిళ్ల : స్థానిక కృష్ణ శారద డిగ్రీ కళాశాలలో శుక్రవారం విద్యార్థులకు 'పది సంవత్సరాల తరువాత నీ జీవితం ఎలా ఉండాలనుకుంటున్నావు?' అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. పోటీల్లో ప్రథమస్థానంలో నిలిచిన నజీమున్నీసాకు కరస్పాండెంట్ నాగార్జునరెడ్డి బహుమతి ప్రదానం చేశారు. కళాశాల చైర్మెన్ డాక్టర్ మార్కారెడ్డి ఆధ్వర్యంలో పోటీలు జరిగాయి.

స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్‌పై అవగాహన



మహిళలకు శానిటరీ నాప్‌కిన్లను అందిస్తున్న డాక్టర్లు

ప్రొద్దుటూరు : మండలంలోని గోపవరం గ్రామంలో శుక్రవారం పశువైద్య కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్‌పై మహిళలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ డి.ఇందిర, డాక్టర్ త్రివేణి మాట్లాడుతూ మహిళలు నెలసరి ఆరోగ్యం, సమతుల్య ఆహారం, శుభ్రతా అలవాట్లపై వివరించారు. స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమం ద్వారా మహిళలకు అన్ని రకాల వైద్య పరీక్షలు నిర్వహించి వైద్య సేవలు అందిస్తారని తెలిపారు. అనంతరం మహిళలకు శానిటరీ నాప్‌కిన్లను పంపిణీ చేశారు.

రక్తదానం



రక్తదానం చేస్తున్న పాఠశాల ఉపాధ్యాయుడు

మైదుకూరు : కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న స్వస్థ్ నారీ స్వశక్త్ పరివార్ అభియాన్‌లో భాగంగా శుక్రవారం స్థానిక సెయింట్ జోసెఫ్ పాఠశాలలో మైదుకూరు ప్రభుత్వ ఆస్పత్రి రక్తనిధి విభాగం, ఐసీటీసీ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. 18 ఏళ్లుల నుండి 45 కిలోలు బరువు, 12 శాతంపైగా హిమోగ్లోబిన్ ఉన్న ప్రతి ఒక్కరూ రక్తదానం చేయవచ్చని వివరించారు. సిబ్బంది 9 మంది రక్తదానం చేశారు. పాఠశాల హెడ్ మాస్టర్ మేరీ బెర్తా, ఐసీటీసీ కౌన్సిలర్ ఎంవీ ప్రసాద్, రక్త నిధి విభాగం నిర్వాహకుడు ఆనంద్ రెడ్డి పాల్గొన్నారు.

యూరియా కోసం పట్టాదారు పాస్‌పుస్తకం తెచ్చుకోవాలి

చాపాడు : యూరియా కావాల్సిన రైతులు పట్టాదారు పాస్ పుస్తకం తప్పనిసరిగా తెచ్చుకోవాలని మండల వ్యవసాయాధికారి దేవీ పద్మలత తెలిపారు. రైతు సేవా కేంద్రాలు, ప్రైవేట్ ఎరువుల దుకాణాల వద్ద ఎరువుల పంపిణీ చేసే క్రమంలో యూరియా కోసం వచ్చే రైతులు తప్పనిసరిగా పట్టాదారు పాస్ పుస్తకం వెంట తెచ్చుకోవాలన్నారు.

చలో మెడికల్ కాలేజీకి తరలి వెళ్లిన కార్యకర్తలు



మాజీ ఎమ్మెల్యే రాచమల్లుతో చలో మెడికల్ కాలేజీకి తరలి వెళుతున్న నాయకులు

ప్రొద్దుటూరు : పులివెందుల ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రైవేటీకరణకు నిరసనగా శుక్రవారం నిర్వహించిన చలో మెడికల్ కాలేజ్ కార్యక్రమానికి ప్రొద్దుటూరు నుంచి సుమారు 20 వాహనాల్లో వైఎస్సార్‌సీపీ శ్రేణులు తరలి వెళ్లారు. మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి ఆదేశాల మేరకు వైఎస్సార్‌సీపీ యువజన విభాగం జిల్లా ఉపాధ్యక్షుడు మోడెం సందీప్, నియోజకవర్గ అధ్యక్షుడు ద్వార్శల గురునాథ్ రెడ్డి ఆధ్వర్యంలో తరలి వెళ్లారు. కార్యక్రమానికి వెళుతూ మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద రెడ్డిని ఆయన నివాసంలో వారు కలిశారు.

ప్రయాణం.. భయం భయం!

కల్వర్టుల దుస్థితిపై ప్రయాణికుల మండిపాటు

- కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం వీడాలంటున్న వాహనదారులు
- ఆర్ అండ్ బీ అధికారులు మరమ్మతులకు చొరవచూపాలంటూ వేడుకోలు
- స్పందించకుంటే భారీ ప్రమాదం తప్పదంటూ హెచ్చరిక



కలసపాడు సమీపంలో కూలేందుకు సిద్ధంగా సగిలేరు నదిపై ఉన్న బ్రిడ్జి



బద్వేలు - సిద్దవటం దారిలో కూలిపోయిన బ్రిడ్జి

బద్వేలు : నిత్యమూ వందలాది వాహనాలు తిరిగే ప్రధాన రహదారి వెంట ఉన్న కల్వర్టులు ఏడాదికొకటి కూలుతున్నాయి. అయితే అదృష్టవశాత్తు ఆ సమయంలో భారీ వాహనాలు కానీ, వాహనచోదకులకు గానీ అక్కడ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పుతోంది. కల్వర్టుల దుస్థితి ఇలా ఉంటే ఆర్ అండ్ బీ(రోడ్లు, భవనాల శాఖ) అధికారులకు చీమకుట్టినట్లు కూడా లేదు. దీంతో రోడ్డుపై పాత కల్వర్టులు కన్పించిందంటే వాహన చోదకులు బెంబేలెత్తిపోతున్నారు. రోడ్డు వెంట ఉన్న మిగిలిన కల్వర్టుల పరిస్థితిని పరిశీలించి వాటికి మరమ్మతులు చేసి ప్రమాదాలు జరుగకుండా చేయాలన్న ఆలోచన అటు అధికారులకు గానీ.. కూటమి ప్రభుత్వ నాయకులకు గానీ లేకపోవడం శోచనీయం.

కూలేందుకు సిద్ధంగా 90కి పైగా కల్వర్టులు

ప్రకాశం జిల్లా గిద్దలూరు నుంచి కలసపాడు వరకు దాదాపు 30 కల్వర్టులు, కలసపాడు నుంచి పోరుమామిళ్ల వరకు మరో 10 కల్వర్టులు కూలేదశకు చేరుకున్నాయి. అలాగే పోరుమామిళ్ల నుంచి బద్వేలు వరకు మరో 25 కల్వర్టులు, బద్వేలు నుంచి సిద్దవటం వరకు ప్రధాన రహదారి వెంట ఇంకో 25 కల్వర్టులు మరమ్మతులకు నోచుకోకపోవడంతో ప్రాణాంతకరంగా మారాయి. కలసపాడు మండలం శంకవరం మొదటి స్టేజీ దగ్గర, పిడుగుపల్లె దగ్గర ప్రధాన రహదారిపై ఉన్న చిన్న సైజ్ బిడ్జీలు కూలేందుకు సిద్ధంగా ఉంటే వైఎస్సార్‌సీపీ హయాంలో వాటిని తొలగించి యుద్ధ ప్రాతిపదికన నూతన బ్రిడ్జీలు నిర్మాణం చేశారు. దీంతో ప్రజలు ఊరిపి పీల్చుకున్నారు. గత ఏడాది అదే శంకవరం దగ్గర రెండు స్టేజీల మధ్యన ఉన్న కల్వర్టు ఉన్నట్టుండి కుప్పకూలింది. అదృష్టవశాత్తు ప్రమాదం ఏమీ జరగలేదు. రెండు నెలల కిందట బద్వేలు - సిద్దవటం ప్రధాన రహదారిలో ఓ చిన్నసైజ్ బ్రిడ్జి కూలిపోయింది. ఇలా రెండు చోట్ల కల్వర్టులు కూలిపోయిన ప్రజల భద్రకు కల్వర్టులను మరమ్మతులు చేసేందుకు ఇటు అధికారులకు కానీ, అటు కూటమి ప్రభుత్వానికి కానీ ముందుకు రాకపోవడంపై ప్రజలు విమర్శిస్తున్నారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తున్నందున దశాబ్దాల క్రితం నిర్మించిన కల్వర్టులు ఎప్పుడు ఎక్కడ కూలిపోతాయో తెలియని పరిస్థితి నెలకొందని వాహనదారులు వాపోతున్నారు. కాగా కలసపాడు సగిలేరు నదిపై ఉన్న బ్రిడ్జి ఇప్పటికే రెండు సార్లు కోతకు గురైతే నామ మాత్రంగా మరమ్మతులు చేశారు. ఆ బ్రిడ్జిని తొలగించి కొత్త బ్రిడ్జిని నిర్మించాలని మహారాష్ట్రకు చెందిన ఓ ప్రైవేట్ సంస్థ టీడీపీ ప్రభుత్వానికి గతంలో నివేదిక సమర్పించింది. దీనిపై ఇప్పటికి ప్రభుత్వం స్పందించలేదంటే ప్రజల ప్రాణాలపై చంద్రబాబు ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధిని ప్రయాణికులు, వాహనదారులు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా ఆర్ అండ్ బీ అధికారులు, కూటమి ప్రభుత్వం ప్రమాదకరంగా ఉన్న 90 కల్వర్టులకు కొత్త వాటిని నిర్మించడమో.. మరమ్మతులు చేయడమో చేయాలని ప్రజలు కోరుతున్నారు.

సాల్ట్ పథకాన్ని రద్దు చేయాలి



యూటీఎఫ్ రణభేరి జాతాలో పాల్గొన్న టీచర్లు

పోరుమామిళ్ల : సాల్ట్ పథకాన్ని రద్దు చేసి ప్రభుత్వ విద్యారంగాన్ని పరిరక్షించాలని యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ఎస్.ఎస్ ప్రసాద్ డిమాండ్ చేశారు. ఉద్యోగ, ఉపాధ్యాయుల ఆర్థిక, విద్యారంగ సమస్యల పరిష్కారానికి యూటీఎఫ్ చేపట్టిన రణభేరి ప్రచార జాతా శుక్రవారం పోరుమామిళ్లలో నిర్వహించారు. ఈ సందర్భంగా మోటార్ సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రసాద్, సురేష్ కుమార్, రాష్ట్ర కార్యదర్శులు లక్ష్మీరాజా, జయచంద్రారెడ్డి మాట్లాడుతూ విద్యారంగ సంస్కరణలు చేస్తూ, అంతర్జాతీయ ప్రమాణాలతో విద్యార్థిని తయారుచేయడం లక్ష్యంగా ప్రపంచబ్యాంకు నుంచి రూ. 1860 కోట్లు అప్పు తెచ్చుకుందని, ఈ అప్పు రాష్ట్ర ప్రభుత్వ విద్యారంగాన్ని బలహీన పరచడమే లక్ష్యంగా ఉందన్నారు. సాల్ట్ పథకం వల్లే పాఠశాల పనిదినాల్లో శిక్షణ ఇస్తున్నారని, రకరకాల బోధనేతర కార్యక్రమాలు రూపొందిస్తున్నారన్నారు. గిన్నిస్ బుక్ రికార్డులకు ఉపాధ్యాయులను మానసికంగా వేధింపులకు గురిచేయడం, పిల్లలకు బోధన లేకుండా చేయడం వల్లే ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య తగ్గుతోందన్నారు. ప్రపంచబ్యాంక్ గణాంకాల వల్ల విద్యార్థులకు నాణ్యమైన విద్య వస్తుందా? అని వారు ప్రశ్నించారు. యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాదన విజయకుమార్, మహేష్ బాబు మాట్లాడుతూ 12వ పీఆర్సీకి ఇంతవరకు చైర్మన్‌ను నియమించలేదన్నారు. సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలన్నారు. బోధనేతర కార్యక్రమాల నుంచి ఉపాధ్యాయులను మినహాయించి, పెండింగ్ బకాయిలు చెల్లించాలన్నారు. ఈనెల 25న గుంటూరులో బహిరంగసభ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో నాలుగు మండలాల యూటీఎఫ్ నాయకులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులను బోధనకే పరిమితం చేయాలి

మైదుకూరు : ఉపాధ్యాయులను బోధనకే పరిమితం చేయాలని ఐక్య ఉపాధ్యాయ సంఘం (యూటీఎఫ్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఏపీ జేఏసీ సెక్రటరీ జనరల్ కేఎస్ఎస్ ప్రసాద్ డిమాండ్ చేశారు. మైదుకూరులో శుక్రవారం యూటీఎఫ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయుల సమస్యలపై రణభేరి పేరుతో బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం కేఎస్ఎస్ ప్రసాద్ మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయులకు హామీలు ఇచ్చి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందని.. అధికారం చేపట్టి 15 నెలలు గడుస్తున్నా హామీలు నెరవేర్చకపోగా ఉపాధ్యాయులతో బోధన తప్ప అన్ని పనులు చేయిస్తోందని ఆరోపించారు. యూటీఎఫ్ సహాధ్యక్షుడు సురేష్‌కుమార్ మాట్లాడుతూ హామీలను వెంటనే నెరవేర్చకపోతే ఈనెల 25న వేలాది మంది ఉపాధ్యాయులతో చలో విజయవాడ చేపట్టి ప్రభుత్వంపై ఒత్తిడి పెంచుతామన్నారు. కార్యక్రమంలో యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శులు లక్ష్మీరాజా, జయచంద్రారెడ్డి, అధ్యక్ష, జిల్లా ప్రధాన కార్యదర్శులు మదన విజయకుమార్, పాలెం మహేష్‌బాబు, గౌరవ అధ్యక్షుడు నాగార్జున రెడ్డి, సహాధ్యక్షులు వై.రవికుమార్, సుజాత రాణి, కార్యదర్శులు సీవీ రమణ, ఎజాస్ అహ్మద్, మురళీ కృష్ణ, లక్ష్మీప్రసన్న, మండల నాయకులు అనిల్ కుమార్ పాల్గొన్నారు.

మహిళలు ఆరోగ్యాన్ని కాపాడుకోవాలి



వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ రవిచంద్రారెడ్డి

ప్రొద్దుటూరు క్రైం : మహిళలు ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని మున్సిపల్ కమిషనర్ రవిచంద్రారెడ్డి తెలిపారు. టీబీ రోడ్డులోని పట్టణ ఆరోగ్య కేంద్రంలో శుక్రవారం స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన మున్సిపల్ కమిషనర్ రవిచంద్రారెడ్డి, ఉప జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ గీత, డాక్టర్ వరుణ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ మహిళలు, పిల్లల ఆరోగ్యం కోసం ప్రత్యేక వైద్య శిబిరాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా నిర్వహిస్తున్నాయన్నారు. ఈనెల 17 నుండి అక్టోబర్ 2వ తేదీ వరకు వైద్య శిబిరాలు నిర్వహిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ హిమబిందు, బీజేపీ పట్టణ అధ్యక్షుడు నరేంద్ర, డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ వెంకటేశ్వర్లు, సబ్ యూనిట్ ఆఫీసర్ శ్రీనివాసులు, డీపీఎంఓ శంకరయ్య, సీఓ సుబ్బారెడ్డి, సూపర్‌వైజర్ రాజారత్నం, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శాంతకుమారి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడికి సన్మానం



సత్యనారాయణను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

కలసపాడు : ఇటీవల జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు పొందిన పుల్లారెడ్డిపల్లె ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు ఎస్.వి.సత్యనారాయణను శుక్రవారం పాఠశాల ఉపాధ్యాయులు రమాదేవి, భాస్కర్ రెడ్డి, గీతారూత్, రాజేశ్వరి సన్మానించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన కార్యక్రమంలో పాల్గొన్న ఎస్టీయూ రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి పి.రమణారెడ్డి మాట్లాడుతూ అవార్డు గ్రహీత సత్యనారాయణ ఒక మంచి ఉపాధ్యాయుడు గానే కాకుండా, ఒక మంచి సామాజిక సేవకుడుగా కూడా కలసపాడు మండలంలో మంచి పేరున్న వ్యక్తి అని అన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ మస్తాన్ వలీ, క్లస్టర్ ప్రధానోపాధ్యాయుడు ఎస్.వి.రమణయ్య, ఎస్టీయూ జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు ఎం.శేఖర్‌బాబు, మండలశాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వెంకటరెడ్డి, బి.ఎస్.వి.ప్రసాద్, కమల్, జి.రమణారెడ్డి, శివారెడ్డి, వినోద్, నాగిరెడ్డి, బాలరాజునాయక్, గురుప్రసాద్, కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వ్యాధులపై అవగాహన



మాట్లాడుతున్న కామనూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి శ్రీనివాస్

ప్రొద్దుటూరు రూరల్ : కామనూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని ప్రభుత్వ సాంఘిక సంక్షేమ వసతి గృహం, ప్రభుత్వ సాంఘిక సంక్షేమ బాలుర వసతి గృహాల్లోని విద్యార్థులకు శుక్రవారం సాయంత్రం కామనూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ శ్రీనివాస్ వైద్య పరీక్షలు నిర్వహించారు. సీజనల్ వ్యాధులైన డెంగ్యూ, మలేరియా, చికున్‌గున్యా, టైఫాయిడ్ వ్యాధుల పట్ల విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని సూచించారు. అనంతరం విద్యార్థుల హాస్టల్ గదులను, మరుగుదొడ్లు, వంట గదులను పరిశీలించి వార్డెన్లకు, విద్యార్థులకు సలహాలు, సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వసతి గృహాల సంక్షేమ అధికారులు రామకృష్ణారెడ్డి, బ్రహ్మం, హెల్త్ సూపర్‌వైజర్ బీఏ వరప్రసాద్, హెల్త్ అసిస్టెంట్ చంద్రశేఖర్, సీహెచ్ఓ నాగలత, ఏఎన్ఎం రజియా, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజాధనం దుర్వినియోగంపై ఫిర్యాదు

మైదుకూరు : మైదుకూరులో అధికారుల నిర్లక్ష్యం వల్ల పెద్ద మొత్తంలో ప్రజాధనం దుర్వినియోగం అయిందని సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోవాలని లోకాయుక్తకు ఫిర్యాదు చేసినట్టు మైదుకూరుకు చెందిన బీపీ ప్రతాప్‌రెడ్డి తెలిపారు. మైదుకూరులో రూ.కోటి వ్యయంతో నిర్మించిన పశుదాణా కర్మాగారం ట్రైల్ రన్‌తోనే మూతపడిందని తెలిపారు. పీఎంఎఫ్‌తోపాటు పశుదాణా కర్మాగారం కూడా లిక్విడేషన్‌లోకి వెళ్లిందన్నారు. కర్మాగారం భూమిని ప్రభుత్వానికి అప్పగించేలా చర్యలు తీసుకోవాలని లోకాయుక్తను కోరినట్టు ప్రతాప్‌రెడ్డి తెలిపారు. మైదుకూరులో పట్టణ, గ్రామీణ పేదరిక నిర్మూలన పథకం కింద మహిళా డెయిరీని ఏర్పాటు చేశారని, అయితే డెయిరీ సామగ్రిని వినియోగించకుండానే మూసివేశారన్నారు. బాధ్యులైన అధికారులపై చర్యలు తీసుకోవాలని లోకాయుక్తను కోరినట్లు పేర్కొన్నారు. మైదుకూరు పశువుల సంతను స్థానిక బద్వేలు రోడ్డులోని గగ్గితిప్ప వద్ద రూ.కోటి వ్యయంతో ఏర్పాటు చేశారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక దానిని అక్కడ నుంచి స్థానిక నంద్యాల రోడ్డులోని మార్కెట్ కమిటీ ఆవరణలోకి తరలించారన్నారు. దీని వల్ల ప్రజాధనం వృథా అయిందని లోకాయుక్తకు ఫిర్యాదు చేసినట్టు తెలిపారు.

గ్రామసభలకు స్పందన కరువు



మేకవారిపల్లెలో గ్రామసభ నిర్వహిస్తున్న అధికారులు, నాయకులు

బి.కోడూరు : ప్రభుత్వం రెవెన్యూ సమస్యలను పరిష్కరించే పేరిట కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఇప్పటి వరకు సుమారు నాలుగు సార్లు గ్రామసభలను ఏర్పాటు చేశారు. కానీ సమస్యలు పరిష్కారం కావడంలో అధికారులు చొరవ చూపలేకపోతున్నారు. దీనికి కారణం రెవెన్యూ సమస్యలను పరిష్కరించేందుకు ఆన్‌లైన్‌లోని వెబ్‌ల్యాండ్‌లో భూముల కొలతలకు సంబంధించి గాని ఆన్‌లైన్‌లో ఉన్న తప్పు ఒప్పులను సరిచేసేందుకు గాని రీసర్వేలో జరిగిన తప్పుఒప్పులను సరిచేసేందుకు గాని మండల స్థాయి అధికారులకు అవకాశం లేకుండా చేసింది కూటమి ప్రభుత్వం. దీంతో అధికారులు చేసేదేమీ లేక పేరుకే గ్రామసభలు ఏర్పాటు చేస్తున్నారు. దీంతో అనుకున్న స్థాయిలో ప్రస్తుతం జరుగుతున్న గ్రామసభలకు ప్రజల నుంచి ఆశించిన స్థాయిలో స్పందన కరువైంది. శుక్రవారం మండలంలోని మేకవారిపల్లె సచివాలయ పరిధిలో జరిగిన గ్రామసభలకు స్పందన కరువైంది. ఇటీవల జరిగిన రీసర్వేలో జాయింట్ ఎల్‌పీఎంల వలన మేకవారిపల్లె రెవెన్యూ పరిధిలో సుమారు 294 మంది లబ్ధిదారులకు కూటమి ప్రభుత్వం అందించే ప్రభుత్వ పథకాలకు అనర్హులుగా మిగిలారు. కానీ ఈ ఏడాదైనా ఆ జాయింట్ ఎల్‌పీఎంల నుంచి వేరు చేసుకుని ఎవరి భూములను వారు ఆన్‌లైన్ చేసుకుని ప్రభుత్వ పథకాలకు అర్హత పొందామనుకుంటే కేవలం రిజిస్టర్ భూములకు మాత్రమే ఎల్‌పీఎంలు వేరు చేసేందుకు అనుమతి ఇచ్చినట్లు రెవెన్యూ అధికారులు తెలుపుతున్నారు. కానీ డీకేటీ భూములకు ఇంకా అనుమతి రాలేదని తెలుపుతుండటంతో బి.కోడూరు మండలంలో ఎక్కువగా డీకేటీ భూములు ఉన్నందున ఎప్పుడు అనుమతులు వస్తాయో, ఎప్పుడు జాయింట్ ఎల్‌పీఎంల నుంయి విముక్తి చెందుతామోననే ఆందోళనలో రైతులు ఉన్నారు. దీనిమూలంగా గ్రామసభలో ఇచ్చిన అర్జీలకు ప్రయోజనం లేకపోవడంతో గ్రామసభలకు స్పందన కరువైంది.

కులగణన తర్వాతే స్థానిక ఎన్నికలు జరపాలి



మాట్లాడుతున్న చంద్రశేఖర్

బద్వేలు అర్బన్ : తెలంగాణ మాదిరిగానే మన రాష్ట్రంలోనూ కులగణన చేపట్టిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని సీపీఐ ఎంఎల్ లిబరేషన్ జిల్లా స్టాండింగ్ కమిటీ సభ్యులు ఎస్.చంద్రశేఖర్ పేర్కొన్నారు. స్థానిక భగత్‌సింగ్ నగర్‌లోని పార్టీ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. శ్రమశక్తితో సంపదను సృష్టించే వెనుకబడిన తరగతులను యంత్రాలుగా చూస్తున్నారే తప్ప వారిని రాజ్యాధికారంలో భాగస్వాములను చేయడం లేదన్నారు. పక్కనే ఉన్న తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల్లో అసెంబ్లీలో బిల్లులు పెట్టి జనగణనలో కులగణన చేసి జనాభా ప్రాతిపదికన స్థానిక సంస్థల ఎన్నికల్లో సీట్లు కేటాయించాలని చూస్తుంటే మన రాష్ట్రంలో మాత్రం చంద్రబాబు ప్రభుత్వం కులగణన చేపట్టేందుకు ముందుకు రాకపోవడం దుర్మార్గమన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాల రాజకీయ ఎదుగుదలకు పాటుపడే ఏకైక పార్టీ తెలుగుదేశం అని గొప్పలు చెప్పుకుంటున్న చంద్రబాబు కులగణన ఎందుకు చేయలేక పోతున్నారో సమాధానం చెప్పాలని ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వం తక్షణమే కులగణన ఏర్పాటు చేయకపోతే వెనుకబడిన తరగతులకు చెందిన 143 కులాల ద్రోహులుగా మిగిలిపోతారని తెలియజేశారు. సమావేశంలో ఆ పార్టీ నాయకులు చెన్నయ్య, పాండు, మహబూబ్‌బాషా, జయరామరాజు, నాగేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

మహిళల ఆరోగ్యంపై దృష్టి సారించాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ సుధ

అట్లూరు : మహిళల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని బద్వేలు ఎమ్మెల్యే డాక్టర్ సుధ పేర్కొన్నారు. అట్లూరులోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కేంద్ర ప్రభుత్వం స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమాన్ని శుక్రవారం ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రక్తపోటు, మధుమేహం, నోటి క్యాన్సర్, రొమ్ము, గర్భాశయ క్యాన్సర్లు వంటి వ్యాధుల స్క్రీనింగ్ వివరాలను స్థానిక వైద్యాధికారులను అడిగి తెలుసుకున్నారు. మహిళలు తమ ఆరోగ్యం పట్ల నిర్లక్ష్యం చేయకుండా ఇలాంటి కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమం మహిళల ఆరోగ్య పరిరక్షణకు ఎంతగానో దోహదపడుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ముదుమాల ప్రభాకర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బోవిళ్ల చిన్న సూరారెడ్డి, జిల్లా పశుగణాభివృద్ధి సంఘం చైర్మన్ రొండా మాధవ రెడ్డి, అటవీశాఖ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ రొండా మల్లికార్జునరెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా సంయుక్త కార్యదర్శి పొన్నపోలు బ్రహ్మానందరెడ్డి, సర్పంచ్ యల్లమ్మ, వైఎస్సార్‌సీపీ నాయకులు ఓబుళరెడ్డి, డీలర్ కృష్ణారెడ్డి, అడిషనల్ డీఎంహెచ్ఓ డాక్టర్ రవిబాబు, స్థానిక వైద్యాధికారులు డాక్టర్ హమీదా బేగం, సీహెచ్ఓ మురళీకృష్ణ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఇస్కాన్ ఆధ్వర్యంలో కల్చరల్ క్యాంప్

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక కొర్రపాడు రోడ్డులోని ఇస్కాన్ కేంద్రంలో ఈ నెల 24 నుంచి అక్టోబర్ 2 వరకు ఇస్కాన్ గోపాల్ ఈ-స్కూల్ ఆధ్వర్యంలో దసరా కల్చరల్ క్యాంప్ నిర్వహిస్తున్నట్లు ఇస్కాన్ ప్రతినిధులు శబరీష్, రామ్మోహన్ తెలిపారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ 1వ తరగతి నుంచి 5వ తరగతి, 6వ తరగతి నుంచి 10వ తరగతి విద్యార్థులకు రెండు విభాగాల్లో రోజు ఉదయం 9.45 నుంచి మధ్యాహ్నం 12.30 వరకు శిక్షణ ఉంటుందని తెలిపారు. చిన్నారుల్లో బుద్ధి, మానసిక వికాసానికి, భగవద్గీత శ్లోకాలు, ధ్యానం, కథలు, నైతిక విలువలు, ఆటపాటలతో ఈ శిక్షణా తరగతులు ఉంటాయన్నారు. శిక్షణ అనంతరం చిన్నారులకు పోటీలు నిర్వహించి రెండు విభాగాల్లో గెలుపొందిన విద్యార్థులకు వేరువేరుగా ప్రథమ బహుమతిగా రూ.5000, ద్వితీయ బహుమతిగా రూ.3000. తృతీయ బహుమతిగా రూ.1000లతో పాటు 10 ప్రోత్సాహక బహుమతులు అందచేస్తామన్నారు. ఆసక్తి గల విద్యార్థులు ఈ నెల 22వ తేదీలోపల తమ పేర్లు నమోదు చేసుకోవాలని, మరిన్ని వివరాలకు 85200 27510, 63034 74393 నంబరుకు సంప్రదించాలని కోరారు.

ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి

ప్రొద్దుటూరు కల్చరల్ : ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని ప్రభుత్వ జిల్లా ఆస్పత్రి ఆయుర్వేద వైద్యురాలు డాక్టర్ అపర్ణ శ్రీరాం పేర్కొన్నారు. స్థానిక వెంకటేశ్వర్ల పేటలోని మానవత స్వచ్ఛంద సేవా సంస్థ కార్యాలయంలో సంస్థ ఆధ్వర్యంలో ధన్వంతరి జయంతి వేడుకల్లో భాగంగా శుక్రవారం ఉచిత వైద్యశిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆయుర్వేద మందులు వాడటం వల్ల ఎటువంటి సైడ్ ఎఫెక్ట్స్ లేకుండా రోగాలను నయం చేసుకోవచ్చన్నారు. వివిధ రోగాలు వాటి నివారణ గురించి వివరించారు. కీళ్ల నొప్పులు, చర్మవ్యాధులు, షుగర్, బీపీ, అలర్జీ తదితర వ్యాధులకు మందులను ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో మానవత సంస్థ ప్రతినిధులు, కాంపౌండర్ అంకాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

21 నుంచి యోగా క్లాసులు

పోరుమామిళ్ల : ఆర్ట్ ఆఫ్ లివింగ్ శ్రీ రవిశంకర్ గురూజీ యోగా కేంద్రం ఆధ్వర్యంలో జరిగే యోగా తరగతులను అందరూ సద్వినియోగం చేసుకోవాలని యోగా గురువు బ్రహ్మయ్య కోరారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఈ నెల 21 నుండి 27 వరకు అహోబిలంలో యోగా తరగతులు జరుగుతాయన్నారు. ఈ తరగతుల్లో ఇచ్చే శిక్షణలో ఆసనాలు, ప్రాణాయామం, ధ్యానం తదితర యోగా పద్ధతులు ప్రతి ఒక్కరిలో శారీరక, మానసికస్థితుల్లో విప్లవాత్మక మార్పులను తీసుకొస్తుందన్నారు. యోగా తరగతుల్లో పాల్గొనేవారు ఈనెల 20వ తేదీ లోపు అహోబిలం చేరుకోవాలన్నారు. వివరాలకు 94935 26908, 91486 84117 నెంబర్లను సంప్రదించాలన్నారు.

ఎమ్మెల్సీకి ఆహ్వానం

పోరుమామిళ్ల : పట్టణంలోని శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరీ దేవస్థానంతోపాటు శ్రీ లక్ష్మీ వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో ఈ నెల 22 నుంచి పది రోజులపాటు జరుగనున్న దసరా బ్రహ్మోత్సవాలలో పాల్గొనాలని కోరుతూ ఆయా దేవస్థానాల కమిటీ సభ్యులు శుక్రవారం ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డికి ఆహ్వాన పత్రిక అందజేశారు. ఎమ్మెల్సీతో పాటు నియోజకవర్గ అదనపు సమన్వయకర్త నల్లేరు విశ్వనాథరెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ మాజీ సలహాదారు నాగార్జునరెడ్డి, నియోజకవర్గ బూత్ కన్వీనర్ల సమన్వయకర్త కల్లూరి రమణారెడ్డి వైఎస్సార్‌సీపీ నాయకులకు ఆహ్వాన పత్రిక అందజేశారు.

నేడు విద్యుత్ అంతరాయం

మైదుకూరు : మైదుకూరు, వనిపెంట, చాపాడులోని అన్ని 33/11 కేవీ సబ్ స్టేషన్లలో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ శాఖ అధికారులు తెలిపారు. ఆయా సబ్‌స్టేషన్లలో మరమ్మతులు చేస్తున్న కారణంగా ఉదయం 7.15 గంటల నుంచి 8.45 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

మద్యం బాటిళ్లు పట్టివేత

చాపాడు : మండలంలోని నరహరిపురంలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న పుత్తా శివారెడ్డిని అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ చిన్న పెద్దయ్య తెలిపారు. అతని వద్ద నుంచి 20 మద్యం ఫుల్ బాటిళ్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ఆరోగ్యకరమైన జీవనశైలి ముఖ్యం

ప్రొద్దుటూరు క్రైం : ఆరోగ్యకరమైన జీవనశైలితో సుఖమయ జీవితం సాధ్యమవుతుందని వైఎస్సార్ కడప జిల్లా క్లస్టర్ ప్రోగ్రాం ఆఫీసర్ వేంపల్లి భాస్కర్ తెలిపారు. చైతన్య ఎడ్యుకేషనల్ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో ఎయిడ్స్‌పై రాష్ట్రస్థాయి క్యాంపెయిన్ నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా వెంకటేశ్వర డిగ్రీ కళాశాలలో శుక్రవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రోగ్రాం ఆఫీసర్ వేంపల్లి భాస్కర్ మాట్లాడుతూ ఆరోగ్యకరమైన జీవన శైలి, సక్రమమైన ఆహారం, రక్తదానం వంటి మంచి అలవాట్లు మన జీవితాన్ని పుష్టిగా మారుస్తాయని తెలిపారు. సోషల్ మీడియా మోసాలు, మానవ అక్రమ రవాణా లాంటి వాటిపై జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మనం జాగ్రత్తగా ఉంటేనే సమాజం ఆరోగ్యంగా, సురక్షితంగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ హరినారాయణ, ప్రిన్సిపాల్ శారద, ఎన్‌సీసీ కోఆర్డినేటర్స్ గౌరీశంకర్, దావూద్, లెక్చరర్స్ బ్యూలా, రామాంజనేయులు రెడ్డి, చైతన్య ఎడ్యుకేషనల్ అండ్ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ స్వచ్ఛంద సంస్థ సిబ్బంది ఓలమ్మ, వంశీ, భాగ్యలక్ష్మి, ఉమామహేశ్వరి పాల్గొన్నారు.